సాక్షి
జగిత్యాల
మంగళవారం ׀ 30 ׀ మే ׀ 2023



నృసింహునికి మొక్కులు

ధర్మపురి : శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. అనుబంధ ఆలయాల్లో మొక్కులు చెల్లించారు.



ఆలయ వార్షికోత్సవం

మెట్‌పల్లి : శ్రీవాసవీమాతా ఆలయ 44 వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పూజలు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.0/28.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం



రోడ్డుపై బైఠాయించిన రైతులు

రాయికల్(జగిత్యాల): రామాజీపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్ల సేకరణలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు సోమవారం రోడ్డుపై సుమారు గంటపాటు బైఠాయించారు. రైతులు మాట్లాడుతూ, కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని లారీల్లో రైస్‌మిల్లులకు తరలించడం లేదని మండిపడ్డారు. ఎలాగోలా తరలిస్తే.. రైస్‌మిల్లర్లు మళ్లీ ధాన్యంలో కోత పెడుతూ ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నాతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న తహసీల్దార్ ఖయ్యూం .. ఘటన స్థలానికి చేరుకుని కొనుగోళ్లను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. వీరికి బీజేపీ నాయకుడు పడాల తిరుపతి, ఎంపీటీసీ ఆకుల మహేశ్ మద్దతు ప్రకటించారు.

శివమారుతిరెడ్డికి స్వాగతం



శివమారుతిరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

కోరుట్లరూరల్: సివిల్స్ -2022 ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 132వ ర్యాంకు సాధించిన అయిలాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు శివమారుతిరెడ్డికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఢిల్లీ నుంచి ఆయన సోమవారం రాత్రి స్వగ్రామానికి చేరుకున్నారు. తమ గ్రామ బిడ్డ సివిల్స్ ర్యాంకు సాధించటం గర్వకారణమన్నారు. సర్పంచ్ పిడుగు రాధ పాల్గొన్నారు.

బీజేపీ పటిష్టత లక్ష్యం



మాట్లాడుతున్న భోగ శ్రావణి

రాయికల్(జగిత్యాల): బీజేపీ పటిష్టత కోసం గ్రామీణ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి కోరారు. స్థానిక ఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో పట్టణ, మండల కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామపంచాయతీలు అభివృద్ధి చెందుతున్నాయనే విషయాన్ని క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలని కోరారు. జగిత్యాలలో నిరంకుశ పాలనను అంతం చేసి ఇక్కడి నుంచే కాషాయ జైత్రయాత్ర ప్రారంభిస్తామని చెప్పారు. ఈనెల 30 నుంచి జూన్ 30వ తేదీ వరకు జరిగే మహాజన్ సంపర్క్ యాత్రలో ప్రతీకార్యకర్త పాల్గొనాలని ఆమె కోరారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరిస్తున్నాం'



సభ్యత్వం అందిస్తున్న భోగ శశిధర్

జగిత్యాల: ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీఎన్జీవో ముందంజలో ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందించేందుకు కృషి చేస్తామన్నారు. మెడికల్ అండ్ హెల్త్ ఫోరం అధ్యక్షుడు రాజేశం, టీఎన్జీవో నాయకులు బాబా, మధుకర్, ప్రణయ్, శ్రీధర్, దయానంద్ పాల్గొన్నారు.

టీచర్ల సేవలో టీపీటీఎఫ్



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాల: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భోగ రమేశ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. రమేశ్ మాట్లాడుతూ, సామాజిక స్పృహ, చైతన్యం కలిగిన ఏకైక సంఘం టీపీ టీఎఫ్ అన్నారు. దానిని మరింత బలోపేతం చేయాలని కోరారు. వేసవి సెలవులు ముగియకముందే బదిలీలు, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎఫ్ విధానం రద్దు చేసి పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొక్కుల రాంచంద్రం, రాజేందర్, రఘుపతియాదవ్, సత్యప్రకాశ్, గోవర్ధన్, నర్సయ్య పాల్గొన్నారు.

'పల్లె'కు పోదాం



కథలాపూర్‌లో పల్లెవెలుగు బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

- ఆదాయం పెంచుకుందాం
- ఆర్టీసీ అధికారుల నిర్ణయం
- గ్రామాలపై ప్రత్యేక దృష్టి
- ఊరుకో వీబీవో నియామకం

కథలాపూర్(వేములవాడ): ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయడంలో ఆర్టీసీ పాత్ర అత్యంత కీలకం. అయితే, ఇటీవల ప్రైవేట్ వాహనాల తాకిడి పెరిగింది. ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. ఈ లోటును పూడ్చుకోవడానికి అధికారులు కొత్త పథకాలు ప్రవేశపెడుతున్నారు. ప్రధానంగా ప్రయాణికులను ఆర్టీసీ బస్సుల వైపు ఆకట్టుకునేందుకు రాయితీపై సీజనల్, విద్యార్థులకు పాసులు అందిస్తున్నారు. వస్తువులను తరలించడానికి కార్గో సేవలు అంబాటులోకి తెచ్చారు. అయినా.. ఆశించిన ఆదాయం రావడం లేదు. దీంతో ఆదాయం పెంచే మార్గాలను అన్వేషిస్తున్నారు.

రంగంలోకి వీబీవోలు..

- ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి ఆర్టీసీ అధికారులు కృషి చేస్తున్నారు.
- ఇందుకోసం విలేజ్ బస్ ఆఫీసర్(వీబీవో)ల నియామకానికి శ్రీకారం చుట్టారు.
- జిల్లాలోని మూడు ఆర్టీసీ డిపోల పరిధిలో వీబీవోలుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారిని గుర్తించారు.
- ప్రయాణికులకు సలహాలు, సూచనలు అందించడమే వీబీవోల విధులు అని అధికారులు పేర్కొంటున్నారు.

మూడు డిపోలు.. 67మంది వీబీవోలు..



తాండ్ర్యాలలో రూట్ సర్వే చేస్తున్న అధికారులు

- జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, 380 గ్రామాల్లోని ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు మెరుగు పర్చడానికి జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. ఈ డిపోల్లోని బస్సులు నిత్యం ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. బస్సుల్లో కండక్టర్, డ్రైవర్లు ప్రయాణికులకు నేరుగా సేవలు అందిస్తున్నారు. అయినా, ఆర్టీసీ గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో అధికారుల్లో అసంతృప్తి నెలకొంది. ప్రయాణికులకు ఆర్టీసీ పథకాలు, సేవల గురించి వివరించేందుకు విలేజ్ బస్ ఆఫీసర్లను నియమించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో జగిత్యాల డిపో పరిధిలో 27 మంది, కో రుట్ల డిపో పరిధిలో 25 మంది, మెట్‌పల్లి డిపో పరిధిలో 15 మంది.. ఇలా మొత్తం 67 మంది వీబీవోలను ప్రస్తుతం నియమించారు.

వీబీవోలు అందించే సేవలు ఇవే..

- విలేజ్ బస్ ఆఫీసర్లు ఆర్టీసీ ద్వారా అందించే సేవలను గ్రామాల్లోని ప్రజలకు వివరిస్తారు.
- సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీ బస్సులను ఆశ్రయించాలని అవగాహన కల్పిస్తారు.
- దివ్యాంగులకు, విద్యార్థులకు రాయితీ పాసులు ఇస్తూ వారికి ఆర్టీసీ, దాని ప్రాధాన్యతను తెలియజేస్తారు.
- అంతేకాకుండా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని డిపో అధికారులకు పంపిస్తారు.
- దీంతో క్షేత్రస్థాయిలో లోపాలను ఎప్పటికప్పుడు గుర్తించి తగిన చర్యలు తీసుకునే వీలుంటుందని భావిస్తున్నారు.
- వివాహాలు, ఇతర కార్యక్రమాలకు అద్దె బస్సుల బుకింగ్ కోసం డిపో వరకు వెళ్లకుండా వీబీవోలను సంప్రదిస్తే వారే బస్సులను సమకూర్చుతారు.
- ఇన్నీ సౌకర్యాలు కల్పించడంతో ప్రజలు ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవడానికి ఆసక్తి చూపుతారని, తద్వారా ఆదాయం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

వీబీవోలతో సమస్యలకు పరిష్కారం



వీబీవోలతో ఆర్టీసీ పథకాలను ప్రజలకు సులభంగా వివరించే వీలుంటుంది. బస్సులు నిర్ణీత వేళల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉండి గ్రామాలకు చేరుతున్నాయో లేదో తెలుసుకునే అవకాశం ఉంటుంది. క్షేత్రస్థాయిలో ప్రయాణికుల అవసరాలు ఎప్పటికప్పుడు గుర్తించవచ్చు. ఆయా ప్రాంతాల్లో వేడుకలు ఉంటే ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పించేందుకు అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవచ్చు. దీంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య పెరుగుతుంది. ఆదాయం అధికంగా సమకూరుతుందని భావిస్తున్నాం. శిక్షణ పొందిన డ్రైవర్లు బస్సులను డ్రైవింగ్ చేసి ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలను చేర్చుతారు. ప్రజలు ఆర్టీసీని ఆదరించాలి.

– ప్రసూనలక్ష్మి, ఆర్టీసీ డీఎం, కోరుట్ల

పేదల గుడిసెలు తొలగింపు

- ఆగ్రహించిన ఆందోళనకారులు
- ఆర్డీవో కార్యాలయం ముట్టడికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. పరిస్థితి ఉద్రిక్తం

కోరుట్లరూరల్: పట్టణ శివారు జంబిగద్దె ప్రాంతంలో ఇళ్ల స్థలాల కోసం సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు నిర్మించి, 50 రోజులుగా పేదలు ఉద్యమిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన కొందరు.. ఆ స్థలంలో గతంలో తమ గుడిసెలు కూడా ఉండేవని, అది తమదేనని పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం ఉదయం 4 గంటలకు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కలిసి మున్సిపల్ జేసీబీ, ట్రాక్టర్లు, సిబ్బంది సాయంతో గుడిసెలు, ఇళ్ల స్థలాల కోసం ఏర్పాటు చేసిన హద్దు కర్రలు తొలగించారు. ఆ ప్రాంతాన్ని చదును చేశారు. అక్కడనే ఉన్న సీపీఎం జిల్లా కన్వీనర్ జి.తిరుపతి నాయక్ సహా 26 మందిని పోలీసులు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు.



ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడిస్తున్న మహిళలు

సమాచారం అందుకున్న ఇళ్లస్థలాల పోరాట కమిటీ మహిళలు.. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లెల బాలకృష్ణ, ఇళ్లస్థలాల పోరాట కమిటీ కన్వీనర్ గుమ్మడి రమేశ్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముట్టడికి యత్నించారు. మహిళలు భారీసంఖ్యలో తరలివస్తున్నారనే సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మహిళలు నినాదాలు చేస్తూ కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు యత్నించగా మహిళా పోలీసులు అడ్డుకున్నారు. ఈక్రమంలో మహిళలు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లెల బాలకృష్ణను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆందోళనకారులను అక్కడి నుంచి పంపించివేశారు. తాము 50రోజులుగా ఇళ్లస్థలాల కోసం ఉద్యమిస్తున్నామన్నారు. ప్రభుత్వ భూమిలోని ముళ్లపొదలు, చెట్లు తొలగించి ఎంతో కష్టపడి చదును చేశామని అన్నారు. గుడిసెలు వేసుకుంటే రెవెన్యూ సిబ్బంది, పోలీసులు తొలగించటం దారుణమన్నారు. ప్రభుత్వం తమకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకూ పోరాటం ఆపేది లేదని వారు పేర్కొన్నారు.

ఇంటికో ఇంకుడుగుంత

- లక్ష్య సాధనకు అధికారుల కృషి
- 57 పంచాయతీల్లో వందశాతం నిర్మాణం
- ఇప్పటివరకు పూర్తయిన ఇంకుడుగుంతలు 47,200



పొరండ్లలో ఇంకుడుగుంత పరిశీలిస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్: భూగర్భ జలాల వృద్ధి లక్ష్యంగా ఇంటింటా ఇంకుడుగుంత తవ్వించేందుకు అధికారులు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం ఉపాధిహామీ ద్వారా పనులకు శ్రీకారం చుట్టారు. జిల్లాలోని 380 గ్రామపంచాయతీల్లో 1.62 లక్షల నివాసాలు ఉన్నాయి. అందులో 92 వేల ఇళ్ల ఆవరణలో ఇంకుడుగుంతలు నిర్మించేందుకు అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటివరకు 47,200 వేలు నిర్మించారు. మిగతా వాటి తవ్వకం పనులు జోరుగా సాగిస్తున్నారు.

57 గ్రామపంచాయతీల్లో వందశాతం పూర్తి..

- జిల్లాలోని 57 గ్రామపంచాయతీల్లో వందశాతం ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తిచేశారు.
- మిగతా గ్రామాల్లో నిర్దేశిత లక్ష్య సాధనకు అధికారులు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నారు.
- ప్రధానంగా మహిళా సంఘాల ద్వారా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు.
- త్వరితగతిన పనులు పూర్తిచేసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

మహిళ సంఘాల ద్వారా రుణాలు..

- ఇంకుడుగుంతల నిర్మాణం కోసం పేదలకు గ్రామైక్య సంఘాల నుంచి రుణాలు కూడా మంజూరు చేస్తున్నారు. ఉపాధిహామీ ద్వారా ఒక్కో ఇంకుడుగుంత నిర్మాణం కోసం రూ.6,646 చెల్లిస్తున్నారు. అయితే, లబ్ధిదారుకు ముందుగా గ్రామైక్య సంఘాల నుంచి రుణం ఇచ్చి.. బిల్లు మంజూరయ్యాక రుణం చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నారు.

వృథా నీటికి అడ్డుకట్ట..

- జిల్లాలో భూగర్భజలాలు పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.
- వర్షాకాలంలో కురిసే వర్షాలతో వృథానీరు రోడ్డుపైకి చేరుతోంది.

ఇలా పోతున్న వృథా నీటితో రోడ్డు బురదమయమవుతోంది.

- ఇంటికోఇంకుడుగుంత నిర్మిస్తే.. వృథాగా పోయే వర్షపునీరు ఇంకుడుగుంతలోకి మళ్లుతుంది.
- ఇలా ఇంకుడుగుంతలో నీరు నిల్వకావడంతో భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి.

వందశాతం లక్ష్యంగా..

- జిల్లాలో 380 గ్రామపంచాయతీల్లో ఇప్పటికే 57 పంచాయతీల్లో వందశాతం ఇంకుడుగుంతలు నిర్మించారు. మిగతా గ్రామాల్లో వందశాతం లక్ష్యం సాధించేలా మహిళా సంఘాల ద్వారా ఇంటింటికీ అవగాహన కల్పిస్తున్నారు.

లక్ష్యం పూర్తిచేస్తాం



ఉపాధిహామీ పథకం ద్వారా ఇంకుడుగుంతలు నిర్మించాలని నిర్ణయించాం. జిల్లాలో 1.62 లక్షల గృహాలు ఉన్నాయి. అందులో 92వేల ఇళ్ల ఆవరణలో ఇంకుడుగుంతలు తవ్వేందుకు అనుమతి ఇచ్చాం. ఇప్పటికే 47,200 ఇంకుడుగుంతలు నిర్మించాం. మిగతావి త్వరలోనే పూర్తిచేసి వందశాతం లక్ష్యం సాధిస్తాం.

– లక్ష్మీనారాయణ, డీఆర్డీవో

వేగంగా నిర్మాణాలు



అవగాహన కల్పిస్తున్న నరేశ్

జగిత్యాలరూరల్: గ్రామాల్లో ఇంకుడుగుంతల నిర్మాణాలను వేగవంతం చేయాలని అదనపు డీఆర్డీవో నరేశ్ సూచించారు. జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఇంకుడుగుంతల నిర్మాణం, తెలంగాణ దశాబ్ది ఉత్సవాలపై సమీక్షించారు. వృథా నీటికి అడ్డుకట్ట వేసేందుకు ఇంటికోఇంకుడు గుంత నిర్మించాలన్నారు. తద్వారా భూగర్భజలాలను పరిరక్షించవచ్చని అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు, సూపరింటెండెంట్ గంగాధర్, ఎంఈవో గాయత్రి, ఏపీఎం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వెల్లువ

- ప్రజావాణికి అభాగ్యుల బారులు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో మాధురి

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మండుటెండలను సైతం లెక్క చేయకుండా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన అభాగ్యులు.. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాస్థాయి అధికారులను సంప్రదించారు. ఈమేరకు వివిధ సమస్యలపై ఆర్డీవో మాధురికి 68 అర్జీలు సమర్పించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన ఆర్డీవో.. ప్రజావాణి ద్వారా అందే సమస్యలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సత్వరమే వాటిని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రుణమాఫీ అమలు చేయండి – రైతుల విజ్ఞప్తి

రాష్ట్రప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.లక్ష వరకు రుణమాఫీ చేయాలని, బ్యాంకర్ల వేధింపులు ఆపాలని కోరుతూ బీజేపీ, కిసాన్ మోర్చా, రైతులు విజ్ఞప్తి చేశారు. రుణమాఫీ అమలు కాకపోవడంతో రైతులు బ్యాంకులకు బకాయిలు పడుతున్నారని అన్నారు. కొత్తగారు ణాలు మంజూరు కావడంలేదని అన్నారు. దీంతోపాటు పాత రుణాల రికవరీకి బ్యాంకర్లు రైతులను వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బ్యాంకర్ల వేధింపుల నుంచి రైతులను కాపాడాలని వేడుకున్నారు.

ఆంధ్రా మేస్త్రీల ఆగడాలు అరికట్టండి

ఆంధ్రాకు చెందిన మేస్త్రీలు స్థానికులమైన తమకు పనిదొరకకుండా చేస్తున్నారని, తాము ఒప్పందం చేసుకున్న ఇంటి యజమానులను కలిసి సుతారి సంఘం నిర్ణయించిన రేట్లకంటే తక్కువ రేట్లకు పనులు చేస్తామంటూ మభ్యపెడుతూ తమ పొట్టకొడుతున్నారని స్థానిక మేస్త్రీలు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సంఘం నిర్ణయించిన రేట్ల ప్రకారం పనులు చేయాలని అడిగితే దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. తమ ఉపాధిని దెబ్బతీయడంతో పాటు తమపై దాడులకు పాల్పడుతున్న ఆంధ్రా సుతారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు సమర్పించిన అర్జీలో పేర్కొన్నారు.

ధరణిలో పొందుపరచండి

కొడిమ్యాల మండలంలోని సర్వే నంబర్ 834, 835లో శ్రీసరస్వతీ విద్యాపీఠం పేరిట గతంలో కొనుగోలు చేసిన 50 గుంట భూమి ధరణిలో చూపించడం లేదని పేర్కొంటూ నిర్వాహకులు ప్రజావాణిని ఆశ్రయించారు. 2017వరకు ఆన్‌లైన్ పహాణితో సహా అన్ని రికార్డులు కలిగిన భూమి.. ధరణిలో పొందు పరచకపోవడంతో పూర్వయజమానులు కబ్జాకు యత్నిస్తున్నారని అర్జీలో పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ధరణి పోర్టల్‌లో నమోదు చేయాలని వారు కోరారు.

మహిళా రైతు వేదనపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

జగిత్యాలరూరల్: కన్నాపూర్ గ్రామంలో ధాన్యం విక్రయించిన కౌలురైతు రెంట భూమక్క వేదనపై అధికారులు స్పందించారు. ధాన్యంలో కోతకు రైతు నిరాకరించిన విషయం విదితమే. మిల్లు వద్ద ఉన్న ధాన్యం తెప్పించాలని నిర్వాహకురాలుకు బాధితురాలు విన్నవించుకుంది. అయితే. 'సీఎం కేసీఆర్ వద్దకు వెళ్లి తెచ్చుకో' అని నిర్వాహకురాలు సమాధానం ఇచ్చింది. ఇదేవిషయంపై 'సాక్షి'లో సోమవారం కథనం ప్రచురితమైంది. దీంతో ఏపీఎం గంగాధర్ సోమవారం విచారణ చేపట్టారు. మహిళా రైతుతో మాట్లాడి మిల్లర్ ధాన్యం దింపుకునేలా ఒప్పించారు. ఏపీఎం మాట్లాడుతూ, ధాన్యం విక్రయించే రైతులు ఆందోళన చెందవద్దన్నారు. కొందరు మిల్లర్లు ఇబ్బందులు పెట్టడంతో సమస్య తలెత్తుతోందని అన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ధాన్యం కొనుగోళ్లతో పాటు, రవాణా సక్రమంగా జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న ఏపీఎం గంగాధర్

'కట్టా'పై సస్పెన్షన్ వేటు..!

- 'సాక్షి' కథనాలపై స్పందించిన ఈఎన్‌సీ
- కట్టా విష్ణువర్ధన్ నియామకం, విద్యార్హతలపై ఆరోపణలు
- సస్పెన్షన్ ఉత్తర్వులను స్వయంగా అందజేసిన ఏఈఈ
- సర్వీస్ రిమూవల్, సాలరీ రికవరీకి డిమాండ్
- 34 ఏళ్లుగా వ్యవస్థల కళ్లకు గంతలు కట్టాడని వెల్లడి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ (ఇంజినీరింగ్)శాఖలో కలకలం రేగింది. విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఏఈగా ఉన్న కట్టా విష్ణువర్ధన్ అలియాస్ వాసుపై సస్పెన్షన్ పడింది. అతని పేరు నుంచి నియామకం జరిగిన తీరు, విద్యార్హతలపై ఉన్న వివాదాలు, సర్వీసు రికార్డులో ఉన్న ఫోర్జరీ సంతకాల ఆరోపణలు వెరసి అతడిపై కొంతకాలంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద చర్చే నడుస్తోంది. అతని వ్యవహారంలో జరిగిన అక్రమాలపై 'సాక్షి' కొంతకాలంగా ఆధారాలతో వరుసగా పరిశోధనాత్మక కథనాలు అందిస్తోంది. ఈ కథనాలపై స్పందించిన హైదరాబాద్‌లోని ఈఎన్‌సీ కార్యాలయం ఆదివారం సాయంత్రం అతడిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ఎన్ని విచారణలు వేసినా..

కట్టా విష్ణువర్ధన్‌పై సాక్షి కథనాలతో హైదరాబాద్‌లోనీ ఈఎన్‌సీ కార్యాలయం అతనిపై జనవరిలోనే విచారణకు ఆదేశించింది. అయితే ఆ జిల్లా అధికారులు విచారణ చేసిన నివేదిక సమర్పించినా.. దానిపై ఎలాంటి ముందడుగూ పడలేదు. పంచాయతీరాజ్ విభాగంలో పనిచేసి రిటైర్డ్ అయిన ఓ మైనార్టీ ఉద్యోగి చక్రం తిప్పి విచారణపై చర్యలు తీసుకోనివ్వలేదని ఉద్యోగులంతా ఆరోపిస్తున్నారు. గతంలోనూ తాము కట్టా విష్ణువర్ధన్ విద్యార్హతల విషయంలో రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సమయంలోనూ సదరు విశ్రాంత అధికారి విచారణను అడ్డుకున్నాడని మండిపడుతున్నారు. అయితే 'సాక్షి'లో అతని విద్యార్హతలు, సర్వీసు రికార్డులో సంతకాల ఫోర్జరీ విమర్శల వరకు అన్ని ఆధారాలతో వరుసగా కథనాలు ప్రచురితం కావడంతో ఇటీవల సచివాలయంలో విచారణ చేపట్టారు. అక్కడా విచారణ ప్రభావితమైందన్న విమర్శలు వచ్చాయి. అదే సమయంలో కొందరు సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు విషయాన్ని చేరవేశారని, జాప్యంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేయడంతోనే ఈఎన్‌సీ కార్యాలయం కట్టా విష్ణువర్ధన్‌పై సస్పెన్షన్ వేటు వేసిందని సమాచారం.

నిర్మల్ నుంచి ప్రత్యేకాధికారి..

కట్టా విష్ణువర్ధన్ ఆదినుంచి వివాదాస్పద అధికారే. అతడి గురించి తెలుసుకున్న ఉన్నతాధికారులు సస్పెన్షన్ ఆర్డర్స్‌ను జాగ్రత్తగా అతడికి చేరవేశారు. సాధారణ ప్యూన్‌లు, క్లర్కులు, ఇతర ఉద్యోగులతో ఇచ్చి పంపిస్తే విష్ణువర్ధన్ తీసుకునే అవకాశాలు తక్కువ అని ముందే గ్రహించిన ఉన్నతాధికారులు ఏఈఈ ర్యాంకు అధికారితో ఆదివారం ఆదేశాలను పంపించారు. నిర్మల్ సబ్ డివిజన్‌లో పనిచేసే సదరు అధికారి హైదరాబాద్ నుంచి వచ్చిన ఆదేశాలను పట్టుకుని సెలవుదినమైనప్పటికీ ఆదివారం కరీంనగర్ చేరుకున్నారు. 'కట్టా'ను ఆఫీసుకు పిలిపించి సస్పెన్షన్ ఆర్డర్స్‌ను అందజేసి, అతనితో రిసీవ్డ్ కాపీ మీద సంతకాలు కూడా తీసుకుని వెళ్లారు. అతనిపై క్రమశిక్షణ చర్యలు కొలిక్కి వచ్చేవరకూ సస్పెన్షన్ కొనసాగుతుందని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ ఆదేశాలు అమలవుతున్న కాలంలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా కరీంనగర్ జిల్లా కేంద్రాన్ని వీడకూడదని స్పష్టం చేశారు.

ఏం జరిగింది..?



కట్టా విష్ణువర్ధన్

కట్టా విష్ణువర్ధన్ ఉరఫ్ వాసు 2 మార్చి 1967లో జన్మించాడు. అతడి తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ టీచర్లే. 1987లో తండ్రి వెంకటనాగరత్నాచారి మరణించారు. తల్లి ప్రభుత్వ టీచరు అన్న విషయాన్ని దాచి 1988లో కారుణ్య నియామకం కింద పంచాయతీరాజ్‌లో అప్ప టి ఉమ్మడి జిల్లాలోని మహదేవపూర్‌లో గ్రేడ్–3 వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా చేరాడు. వాస్తవానికి 1984లోనే కట్టా నిరూప ప్రభుత్వ టీచర్‌గా నియమితులయ్యారు. కరీంనగర్ డీఈవో కార్యాలయంలో ఆమె పుట్టిన తేదీ 01 ఫిబ్రవరి 1956గా ఉంది. కానీ, విష్ణువర్ధన్ తన పదో తరగతి సర్టిఫికెట్లలో 02 మార్చి 1967లో జన్మించినట్లు పేర్కొన్నారు. తల్లి కంటే కేవలం పదేళ్లు చిన్నవాడంటూ అందరి కళ్లకు గంతలు కట్టాడు. నిబంధనల ప్రకారం.. కారుణ్య నియామకం కింద నాన్ టెక్నికల్ పోస్టులో చేరాల్సిందిగానీ అతను టెక్నికల్ పోస్టులో చేరడం గమనార్హం. అతని సర్వీసు రికార్డులో ఉన్న సంతకా లు ఫోర్జరీ అన్న ఆరోపణలు దుమారానికి కారణమయ్యాయి. తన సర్వీసులో పెద్దపల్లి, జగి త్యాల, సిరిసిల్లలో అనేకచోట్ల పనిచేసిన ఇతను ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్నాడు.

సాలరీ రికవరీ చేయాలి



కట్టా విష్ణువర్ధన్ విద్యార్హతల విషయంలో ఏళ్లుగా వివాదం సాగుతోంది. 34 ఏళ్లుగా వ్యవస్థల కళ్లకు గంతలు కప్పిన అతనిపై సస్పెన్షన్ వేటు పడటం శుభపరిణామం. అక్రమంగా విధుల్లో చేరిన అతడిని సర్వీసు రిమూవల్ చేసి, అతనికి ఇంత కాలం ప్రభుత్వం అందజేసిన సాలరీని అధికారికంగా రికవరీ చేయాలి. అతనిపై క్రిమినల్ కేసులు బుక్ చేసి, అరెస్టు చేయాలి.

ఆమీర్, సామాజిక కార్యకర్త..

క్లుప్తంగా

ర్యాంకర్లకు విద్యాధికారి ప్రశంసలు


రాష్ట్ర స్థాయి ర్యాంకర్లను అభినందిస్తున్న డీఈవో రమేశ్

సిరిసిల్లకల్చరల్: వివిధ పోటీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన పలువురు విద్యార్థులను జిల్లా విద్యాధికారి రమేశ్ అభినందించారు. స్థానిక యోగీశ్వర ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న విద్యార్థులు పాలిసెట్, టీఎస్‌ఆర్‌జేసీ ప్రవేశపరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. వి.ప్రీతి పాలీసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు, ఎం.జశ్వంత్ టీఎస్‌ఆర్‌జేసీ పరీక్షలో రాష్ట్ర స్థాయి ఆరో ర్యాంకు సాధించారు. యోగీశ్వర ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు గూడూరి నిశాంత్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

చందుర్తి(వేములవాడ): చందుర్తి–మర్రిగడ్డ గ్రామాల మధ్య సోమవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి చందుర్తికి చెందిన లింగంపల్లి తిరుపతి తీవ్రంగా గాయపడ్డాడు. బైక్‌పై వేములవాడకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. తిరుపతి కాళ్లు విరిగి, తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు.

విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

సిరిసిల్లక్రైం: విధి నిర్వహణలో ఉన్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 20 కేసుల్లో పోలీసు విధులకు ఆటంకం కలిగించిన 54 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మలేసియాకు పంపిస్తామని మోసం

సిరిసిల్లక్రైం: మలేసియాకు పంపిస్తామని చెప్పి పలువురి దగ్గర డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వారిపై సిరిసిల్ల టౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. స్థానిక సుభాష్‌నగర్‌కు చెందిన దూష రమేశ్ విదేశాలకు వెళ్లాలని సిరిసిల్లలోని వాసవినగర్ ఆదిత్య మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ దార్నం శ్రీనివాస్‌ను కలిశారు. శ్రీనివాస్ తనకున్న పరిచయాలతో 15 మంది నుంచి పాస్‌పోర్టులు, రూ.6 లక్షలు సేకరించి మలేషియాకు పంపేందుకు చెన్నైకి చెందిన మణికందన్, శరవణన్‌ను సంప్రదించి డబ్బులు పంపించారు. వారు ఆన్‌లైన్‌లో వీసాలు పంపించారు. సదరు వీసాలను పరిశీలించగా నకిలీవిగా తేలడంతో మోసపోయామని గమనించిన దూస రమేశ్ సోమవారం చెన్నైకి చెందిన మణికందన్, శరవణన్‌లపై ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

సమయపాలన పాటించని వైద్య సిబ్బంది

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సిబ్బంది విధుల్లో సమయ పాలన పాటించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. చిప్పలపల్లికి చెందిన దివ్య కుమారుడు హిమాన్షు కోతి దాడిలో గాయపడ్డాడు. హిమాన్షును తీసుకొని తల్లి పోతుగల్ పీహెచ్‌సీకి సోమవారం ఉదయం వచ్చింది. ఆస్పత్రిలో వైద్య సిబ్బంది లేకపోవడంతో అక్కడే ఉన్న స్వీపర్ బాలమ్మను అడిగి వివరాలను తెలుసుకుంది. ఉదయం 9.20 దాటినా సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో స్టాఫ్‌నర్స్ రాజేశ్వరి హిమాన్షుకు చికిత్స అందించింది. దీనిపై హెచ్‌ఈవో యాదగిరిని వివరణ కోరగా నిత్యం వైద్యసేవలు అందిస్తామని, సిరిసిల్లలో సమావేశం ఉన్నందున ఉద్యోగులు అందుబాటులో లేరని తెలిపారు. మరోసారి ఇలాంటి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

పంపిణీకి సిద్ధంగా..


పెగడపల్లి సహకార సంఘంలో నిల్వ ఉన్న జీలుగ బస్తాలు

- జీలుగ, జనుము విత్తనాలు
- మండలాల వారీగా కేటాయింపు
- జిల్లాకు 13,300 క్వింటాళ్లు సరఫరా
- ఏర్పాట్లలో వ్యవసాయ అధికారులు

పెగడపల్లి: జిల్లాలో ఖరీఫ్ సాగుకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంది. ఈ మేరకు వానాకాలం సీజన్‌లో జిల్లాలో సుమారు 4.60 ఎకరాల్లో వివిధ పంటలు చేయనుండగా, ఇందులో సుమారు 3లక్షల ఎకరాల్లో వరకు వరి ఉండొచ్చని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకోసం పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ, జనుము పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జీలుగ, జనుము విత్తనాలు దుక్కిలో కలియదున్నితే భూసారం పెరుగుతుంది. ఇందుకు అవసరమయ్యే విత్తనాలు ఏటా వానాకాలం సాగుకు ముందు అందిస్తున్నారు. రోజురోజుకూ రసాయన ఎరువుల వినియోగం పెరుగుతోంది. దీంతో భూసారం తగ్గి ఆశించిన మేర దిగుబడి రావడం లేదు. చాలామంది రైతులు సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నా పూర్తిదశలో రైతులు ముందుకురావడం లేదు. కనీసం దుక్కిలోనైనా పచ్చిరొట్ట ఎరువులు వేస్తే కొంతమేర అయినా భూసారం పెరిగే అవకాశముంది. ప్రభుత్వం జీలుగను 65 శాతం రాయితీపై రైతులకు అందజేస్తోంది. క్వింటాల్‌కు రూ. 8,025 ధర ఉంటే రూ. 5,218 రాయితీ ఇస్తోంది. రైతు రూ.2,809 చెల్లించాల్సి ఉంటుంది. 30 కిలోల జీలుగ బస్తా రూ. 842.70, జనుము 40 కిలోల బస్తాకు రూ.1224.80 చెల్లించాలి.

జిల్లాకు మంజూరైన విత్తనాల వివరాలు (క్వింటాళ్లలో)

మండలం	జీలుగ	జనుము
బీర్‌పూర్	490	70
బుగ్గారం	420	50
ధర్మపురి	850	60
గొల్లపల్లి	1020	60
ఇబ్రహీంపట్నం	560	60
జగిత్యాల	190	60
జగిత్యాల రూరల్	880	70
కథలాపూర్	880	70
కొడిమ్యాల	750	60
కోరుట్ల	750	60
మల్లాపూర్	900	80
మల్యాల	520	50
మేడిపల్లి	970	80
మెట్‌పల్లి	900	70
పెగడపల్లి	960	80
రాయికల్	800	80
సారంగాపూర్	520	60
వెల్గటూర్	940	80
మొత్తం	13,300	1200

సద్వినియోగం చేసుకోవాలి



రైతులు జీలుగ విత్తనాలు తీసుకునేందుకు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌ను మండల వ్యవసాయాధికారులను అందించాలని పర్మిట్ మంజూరు చేస్తారు. వ్యవసాయ సహకార సంఘాలు, అగ్రోస్ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తాం. జిల్లాకు 13,300 క్వింటాళ్లు మంజూరయ్యాయి. జీలుగతో పాటు జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అన్ని మండలాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

ఆసునూరిగూడెంలో అగ్ని ప్రమాదం


కాలిబూడిదైన ఇళ్లు


దగ్ధమైన నగదు


కాలిపోయిన పత్తి

- రెండు పూరి గుడిసెలు దగ్ధం
- కాలిబూడిదైన నగదు, బంగారు వెండి ఆభరణాలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలోని శివారు గ్రామం ఆసునూరిగూడెంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరి గుడిసెలు దగ్ధంకాగా బంగారు వెండి ఆభరణాలతో పాటు, నగదు కాలిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. ఆసునూరిగూడెంకు చెందిన ఏదుల లక్ష్మి, పెరుమల్ల శిరీషకు చెందిన పూరి గుడిసెలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకుంది. గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఏదుల లక్ష్మికి చెందిన నాలుగు తులాల బంగారం, వెండి, పత్తి, దుస్తులు, నగదుతో పాటు, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. దీంతో రూ.5.77 లక్షల నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. పెరుమల్ల శిరీష ఇంట్లో 15 తులాల వెండి, 2 తులాల బంగారం, 40 క్వింటాళ్ల పత్తి, సామగ్రితో పాటు రూ. 2,54,000 నగదు కాలిపోయింది. రూ. 8.31 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. బాధిత కుటుంబాలను ఎంపీపీ మసర్తి రమేశ్, తహసీల్దార్ శ్రీలత, సర్పంచ్ గర్శకుర్తి శిల్ప, విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు పరామర్శించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు రూ.5 వేలతో పాటు 25 కిలోల చొప్పున బియ్యం అందించామని, ప్రమాద వివరాలను ప్రభుత్వానికి నివేదించినట్లు తహసీల్దార్ శ్రీలత పేర్కొన్నారు.

కౌలుకు తీసుకుని వ్యవసాయం..

ఆసునూరిగూడెంకు చెందిన ఏదుల కళవ్వ – భూమయ్య దంపతులకు ముగ్గురు కూతుళ్లు. మొదటి కూతురు పెద్ద లక్ష్మికి వివాహం కాగా భర్త చనిపోయాడు. రెండో కూతురు చిన్న లక్ష్మి చనిపోగా శిరీష, రాజేశ్వరి, అశ్విన్ ముగ్గురు పిల్లలుండగా అమ్మమ్మ వద్ద ఉంటున్నారు. తల్లి చనిపోవడం, తండ్రి దూరంగా ఉండడంతో అమ్మమ్మతో ఉంటూ వ్యవసాయ పనులు చేస్తున్నారు. శిరీష డిగ్రీ చదువుతుండగా, రాజేశ్వరి ఇంటర్, అశ్విన్ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. మూడో కూతురు సుశీలకు వివాహం కాలేదు. వీరంతా ఉమ్మడిగా ఉంటూ గ్రామంలో నాలుగెకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి వేశారు. పత్తిని అమ్మేందుకు సిద్ధమవుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పూరిగుడిసెల స్థానంలో రేకులషెడ్డు వేసుకుందామని అప్పు తెచ్చిన రూ. 3 లక్షలు కాలిపోవడంతో బోరున విలపిస్తున్నారు.

'రైతుల కష్టాలు పట్టని మంత్రి'


మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి(ధర్మపురి): తాలు, తప్ప పేరిట కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తూకంలో కోత విధించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వీటిపై జిల్లా మంత్రి స్పందించకపోవడం శోచనీయమని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. కొనుగోలు కేంద్రాలను సందర్శించేందుకు మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు సమయం లభించడం లేదు కానీ.. ఆత్మీయ సమ్మేళనాలకు సమయం దొరుకుతుందా? అని ఎద్దేవా చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్వింటాలుపై 4 కిలోల నుంచి 6 కిలోలు మిల్లర్లు కోత విధిస్తూ రైతులకు నిండా ముంచుతున్నా కలెక్టర్, మంత్రి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. లారీల్లో ధాన్యం బస్తాలు లోడ్‌చేసేందుకు డ్రైవర్లు కూడా బస్తాకు ఒకరూపాయి చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలా ఎవరికి వారే రైతులను దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. నాయకులు రాములుగౌడ్, మహేందర్‌రెడ్డి, శంకర్, శ్రీనివాస్, మల్లారెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోట దగ్ధం

సారంగాపూర్: మండల కేంద్రంలోని వురుమల్ల లక్ష్మారెడ్డికి చెందిన మామిడితోట నిప్పంటుకొని దగ్ధమైంది. లక్ష్మారెడ్డికి చెందిన మూడెకరాల మామిడి తోటకు సోమవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో దాదాపు 50 మామిడి చెట్ల వరకు కాలిపోయాయి. రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

ధర్మపురి : చిన్నారిపై కుక్కలు దాడిచేసి గాయపర్చిన సంఘటన ధర్మపురిలో చోటు చేసుకొంది. పట్టణంలోని గోపికృష్ణ థియేటర్ వెనుక భాగంలోని ఎస్సీ కాలనీకి చెందిన బొల్లారపు ఐశ్వర్య అనే చిన్నారి సోమవారం సాయంత్రం ఇంటిముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడిచేశాయి. చికిత్స నిమిత్తం చిన్నారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. పట్టణంలో కుక్కల బెడద రోజురోజుకూ పెరిగిపోతోందని కాలనీవాసులు వాపోతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: మైనారిటీ గురుకుల పాఠశాల్లో ఉపాధ్యాయులుగా పని చేసేందుకు ఆసక్తి, అర్హత అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా అధికారి మెహరాజ్‌మహమ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాల, కళాశాలల్లో అన్ని సబ్జెక్టులు టీజీటీ, పీజీటీ, జేఎల్ పోస్టులకు దరఖాస్తులను వారం రోజుల్లోగా సమర్పించాలని సూచించారు.

పేదలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

కరీంనగర్ కల్చరల్: పేద ప్రజల ఓట్లతో గెలిచిన రాష్ట్ర ప్రభుత్వం వారినే పట్టించుకోవడం లేదని భూసాధన పోరాట కమిటీ అధ్యక్షుడు జక్కనపల్లి గణేశ్ విమర్శించారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. అసంఘటిత కార్మికులు, లేబర్ అడ్డా కూలీల సంపాదనలో సగానికి పైగా నెలవారీ ఇంటి అద్దెకే పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వలస కూలీల కుటుంబాల్లో పిల్లల విద్య, వైద్యానికి డబ్బులు సరిపోక నిరక్షరాస్యులుగా మిగిలిపోతూ, అనారోగ్య పరిస్థితుల్లో తనువు చాలిస్తున్నారని తెలిపారు. అధికార యంత్రాంగం వెంటనే స్పందించి, ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ షఫీ, సభ్యులు రేవోజు వాణి, బానోతు సునీత, మాతంగి రేణుక, మిట్టపల్లి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

జగిత్యాల: జిల్లాలో దశాబ్ది ఉత్సవాల వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు దినోత్సవం రోజు జిల్లాలోని రైతు వేదికల్లో వేడుకలు జరగాలన్నారు. జూన్ 8న ఊరూరా చెరువుల పండగ సందర్భంగా గ్రామాల్లో ఉన్న పెద్ద చెరువు వద్ద బతుకమ్మ, బోనాలతో సాంస్కృతిక కార్యక్రమాలు, కట్టమైసమ్మ పూజ, భోజనాలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో సురక్ష దివస్, తెలంగాణ రన్ నిర్వహించాలని, సాగునీటి రంగంలో సాధించిన విజయాలను తెలియజేయాలన్నారు. జూన్9న సంక్షేమ సంబరాల్లో భాగంగా గొర్రెల పంపిణీ, ఇంటి పట్టాల పంపిణీ, బీసీ కుల వృత్తులకు ఆర్థిక సహాయాన్ని ప్రారంభించాలన్నారు. పల్లెప్రగతి, పట్టణ ప్రగతిలో సాధించిన విజయాలు వివరించాలన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మకరంద్, లత, ఎస్పీ భాస్కర్, పాల్గొన్నారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు


స్రవంతి

ఇబ్రహీంపట్నం : అసలే నిరుపేద కుటుంబం.. అందులోను ముగ్గురు ఆడపిల్లలు, ఓ కూతురు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆపన్నహస్తం కోసం ఆ తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన దెంపెట రాములు – సుశీల దంపతులకు ముగ్గురు కుమార్తెలు స్వప్న (25), స్రవంతి (23), సంగీత (20) ఉన్నారు. కొన్ని రోజుల నుంచి స్రవంతి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఎనిమిది రోజుల క్రితం చికిత్స నిమిత్తం జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు ఆస్పత్రికి తరలించారు. రెండు కిడ్నీలకు ఇన్ఫెక్షన్ రావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. తండ్రి రాములు మతిస్థిమితం లేకపోవడంతో తల్లి సుశీల కూలీ పనిచేసి కుటుంబాన్ని పోషిస్తోంది. స్రవంతికి వైద్య ఖర్చులు రోజూ 40వేల నుంచి రూ.50 వేలు ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. దాతలు స్పందించి 7993365102 నంబర్‌కు గూగుల్ పే ద్వారా ఆర్థిక సాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో కేసుల ఛేదన


మాట్లాడుతున్న సీఐ రాంచందర్‌రావు

జగిత్యాలక్రైం: అందుబాటులోని సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి కేసులు ఛేదించాలని పట్టణ సీఐ రాంచందర్‌రావు సూచించారు. ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు స్టేషన్‌హౌస్ ఆఫీసర్లకు వర్టికల్స్‌పై సోమవారం స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ, పెండింగ్ కేసులపై ప్రతీరోజు సమీక్షించాలన్నారు. ప్రతీ పోలీసు అధికారి శ్రద్ధతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని అన్నారు. విధి నిర్వహణలో సందేహాలు తలెత్తితే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. సమస్యలపై సత్వరమే స్పందిస్తూ, మెరుగైన సేవలే అందించడం ద్వారానే పోలీసు శాఖపై ప్రజలకు మరింత నమ్మకం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నరేశ్, అశోక్, సందీప్, రామకృష్ణ, సదాకర్, ఆర్‌ఎస్సై దినేశ్, డీసీఆర్బీ సిబ్బంది పాల్గొన్నారు.

'జువ్వాడి' దిష్టిబొమ్మ దహనం


ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ మహిళా నాయకులు

మల్లాపూర్: మండలంలోని ముత్యంపేట శివారులో నిజాం షుగర్ ఫ్యాక్టరీ వద్ద సోమవారం జువ్వాడి నర్సింగరావు దిష్టిబొమ్మను కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ కోవర్ట్ జువ్వాడి అని, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడిగా ఉంటూ పార్టీకి నష్టం చేసే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. మూడురోజుల క్రితం కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోతే జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడగొడుతామని ప్రకటించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. జువ్వాడి అనుచరులు బెజ్జారపు శ్రీనివాస్, గూడ శ్రీకాంత్ కూడా కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోతే బీజేపీ టికెట్ ఇస్తుందని, ఎంపీ అర్వింద్ హామీ ఇచ్చారని తెలుపడంతో జువ్వాడి బీజేపీ కోవర్టు అని తెలిపోయిందన్నారు. జువ్వాడి నర్సింగరావుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ముత్యంపేట మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు

రాయికల్: మండలంలోని ఓ గ్రామానికి చెంది న యువతిని పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన చిర్ర రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరా ల ప్రకారం.. ఓ గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువతిని గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లికి చెందిన చిర్ర రాజు పెళ్లి చేసుకుంటానని మా యమాటలు చెప్పి గర్భిణిని చేశాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు రాజుతో పాటు బెదిరింపులకు పాల్పడిన తల్లిదండ్రులు లచ్చయ్య, లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాడిచేసిన నలుగురిపై..

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని లద్దుఖాజా చౌరస్తా వద్ద మెకానిక్‌గా పనిచేస్తున్న ఎండీ షారుఫ్‌పై దాడిచేసిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై రహీం తెలిపారు. తీన్‌ఖని చౌరస్తాలో మెకానిక్‌గా పనిచేస్తున్న ఎండీ.షారుఫ్‌పై సోమవారం కటికెవాడకు చెందిన నరేశ్, రాజు, సుమన్ తేజ, తేజ దాడిచేశారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తెలిపారు.

మహిళను వేధించిన వ్యక్తులపై..

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని లద్దుఖాజా ప్రాంతానికి చెందిన మహిళను బెదిరించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై రహీం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కటికెవాడకు చెందిన మహిళను లద్దుఖాజా చౌరస్తాకు చెందిన ఇలియాస్, షారుఫ్ కొంతకాలంగా వేధిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం సదరు మహిళ పనినిమిత్తం బయటకు వెళ్లగా ఇలియాస్, షారుఫ్‌లు అసభ్యపదజాలంతో దూషించారు. దీంతో బాధితురాలు కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముగిసిన అంత్యక్రియలు

కోనరావుపేట: మండలంలోని కొలనూర్ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా సోమవారం స్వగ్రామంలో అంత్యక్రియలు ముగిశాయి. వివరాల్లోకి వెళ్తే.. నిమ్మపల్లికి చెందిన అనుముల ఓదెలు, అతని సోదరుడు లింగారెడ్డి, లింగారెడ్డి కుమారుడు నాగరాజు కలిసి ఓ శుభకార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కొలనూర్ శివారులో ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఓదెలు, నాగరాజు మృతిచెందగా, లింగారెడ్డికి గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. కాగా ఇద్దరి అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది.





లాల్‌బహదూర్ స్టేడియంలో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల క్రీడాకారులు

చీఫ్ మినిస్టర్స్ కప్.. మనోళ్ల మార్చ్‌ఫాస్ట్

కరీంనగర్ స్పోర్ట్స్: చీఫ్ మినిస్టర్స్ కప్–2023 రాష్ట్రస్థాయి పోటీలు సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ముందుగా జరిగిన మార్చ్‌ఫాస్ట్‌లో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన క్రీడాకారులు తమ ప్లకార్డులు, ఫ్లాగ్‌లతో పాల్గొన్నారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.